## కాశ్మీర్‌కి కన్యాకుమారికి ఉన్నంత తేడా ఉంది.

ఒక యుద్ధం తాలూకు జ్ఞాపకాల్ని మనం ఎంత వరకు మొయ్యగలం? ఇక్కడ యుద్ధమంటే కురుక్షేత్రం కాదు జీవితం. ఎందుకంటే గతాన్ని అంటిపెట్టుకుని తిరిగే జ్ఞాపకాలు ఎలాంటివైనా మనతో పాటు మొయ్యక తప్పదు. నాకూ మొయ్యక తప్పలేదు.

***

దాదాపుగా మూడు గంటల నుండి తొంబై స్పీడ్‌తో నా బైక్ పరిగెడుతుంటే, దానికి సమానంగా నా మదిలో ఆలోచనలు కూడా అంతే వేగంగా పరుగులు తీసాయి. ఎప్పుడూ బద్ధకంగా వెళ్లే సూర్యుడు కూడా శీతాకాలం వచ్చిందనే ఆనందంలో కంగారుగా వెళ్లిపోవాలని తన కాంతిని కొంచెం కొంచెం తగ్గించుకుంటూ దూరమైపోయాడు. నెలవంక వచ్చిందని అంచనా వేసుకుని చలి కూడా తన ప్రతాపం చూపించింది. ఉన్నట్టుండి నాలో ఎక్కడో తెలియని నీరసం మొదలైంది. ఇవాళ్టి నా ప్రయాణానికి ముగింపు చెప్పాలని నా శరీరం అలసిపోయి, ఆగిపోమని మనసుకు సిగ్నల్ ఇచ్చింది. వెంటనే నా మనసు పదే పదే ఆగిపో అనేసరికి ఇక చేసేది ఏంలేక బైక్‌ని ఒక చోట ఆపాను.

హైవే కాకపోవడంతో అప్పుడప్పుడు పలకరిస్తూ వెళ్తున్న వాహనాలు. బాగా

చీకటి పడటంతో నెలవంక నిండుగా చందమామ రూపంలోకి మారి వెన్నెలని కురిపిస్తున్నాడు. ఆ వెన్నెల కాంతిలో చుట్టూ ఉండే కొండలు మంచులో కలిసిపోయి నీడలా కనిపించాయి.

కనిపించినంత మేరా పచ్చటి గడ్డితో అక్కడక్కడా పెద్ద పెద్ద చెట్లు. దానికి తోడుగా పక్కనే ఎండిపోయి కూలిన చెట్లతో ఒక చిన్న పాటి మైదానంలా ఉంది ఆ ప్రదేశం అంతా. నా ఫోన్ టార్చ్‌లైట్ వేసుకుని అక్కడ ఉండే కొన్ని ఎండిన కట్టెలు తెచ్చుకుని బైక్ హెడ్‌లైట్ వెలుతురులో పడుకోవడానికి టెంట్ సిద్ధం చేసి, దానికి రెండు మూడు అడుగులు దూరంలో, ఆ కట్టెలని ఉపయోగించి మంట వెలిగించాను. కానీ వెలగలేదు. మంచుకు తడిసిపోవడం వల్ల రెండు మూడు సార్లు పెట్రోల్ వేస్తే గానీ వెలగలేదు. మంట వెలిగిన మరుక్షణం అక్కడుండే ప్రదేశం చిన్నపాటి వెలుగుతో అద్భుతంగా మారిపోయింది. మధ్యాహ్నం కొన్న ఆపిల్స్ తింటూ బుక్ చదవడం మొదలు పెట్టాను.

కొద్దిసేపటికి ఒక డెబ్భై అడుగుల దూరంలో ఒక కార్ వచ్చి ఆగింది. అందులో నుండి ఇద్దరమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలు దిగి అక్కడుండే ప్లేస్‌ని శుభ్రం చేసి నాలాగే టెంట్ సెట్ చేసుకుంటున్నారు. వాళ్ళ మాటలు వింటుంటే, బహుశా మా ఆంధ్ర నుండి వచ్చారని అర్థమైంది. మళ్లీ నా పుస్తకానికి బానిసగా మారిపోయాను.

ఉన్నటుండి, “హలో ఎక్స్‌క్యూజ్‌మీ సార్” అని ఒక అమ్మాయి పిలుపు వినిపించింది. తిరిగి చూసాను. అమ్మాయి పక్కనే అబ్బాయి కూడా ఉన్నాడు.

“ఇఫ్ యూ డోంట్ మైండ్, వుడ్ యూ షేర్ సమ్ పెట్రోల్” అంది.

“అక్కడ నా బండికి తగిలించింది ఉంది. పట్టుకెళ్లండి.”

ఆ మాటకు వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

“మీరు తెలుగా?” పక్కన ఉన్న అబ్బాయి అడిగాడు.

“అవును.ఆంధ్రా.”

వాళ్ల ముఖంలో ఆనందం కనిపించింది.

“మాది తెలంగాణ” అంటూ నాకు షేక్ హ్యాండ్ ఇచ్చాడు. నేను కూడా షేక్ హ్యాండ్ ఇచ్చాను. తరువాత వాళ్ళిద్దరూ పెట్రోల్ తీసుకెళ్లి క్యాంప్ ఫైర్ వెయ్యడంతో

అక్కడుండే ప్రదేశం ఇంకాస్త అందంతో అద్భుతంగా మారిపోయింది.

"థాంక్యూ సో మచ్ సార్. మా వాళ్ళు వస్తూ వస్తూ పెట్రోల్ మొత్తం కార్‌లో వేశారు. అందుకే మిమ్మల్ని అడగాల్సి వచ్చింది. ఏం అనుకోవద్దు సార్" పెట్రోల్ బాటిల్ ఇస్తూ అన్నాడు.

"పర్లేదు. మీ పేరు?" తీసుకుంటూ అడిగాను.

"అరవింద్."

"ఇందాక నీతో పాటు వచ్చిన అమ్మాయి పేరు మౌనిక కదా?"

"అవును.మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అంటే తన చేతి మీద మీ పేరుంది. మీ చేతి మీద ఆమె పేరుంది" అని చెప్తే తను సిగ్గు పడ్డాడు.

"సారీ! ఫీల్ అయ్యి ఉంటే."

"అయ్యో పర్లేదు సార్."

" బట్ మీ జంట చాలా బాగుంది."

"థాంక్యూ సార్" అని చెప్పి అతను అక్కడ నుండి వెళ్ళిపోయాడు. నేను కూడా నా పుస్తకంలోకి వెళ్ళిపోయాను. అరగంట గడిచింది. మళ్ళీ వాళ్ళిద్దరూ నా దగ్గరికి వచ్చారు.

"చెప్పండి, మళ్ళీ ఏం కావాలి?"

"అయ్యో మిమ్మల్ని అడగటానికి రాలేదు. ఇవ్వడానికి వచ్చాము" అరవింద్ అన్నాడు.

"అంటే?"

"ఒకసారి మాతో రండి."

"ఎందుకు?" అర్థంకాక అరచేతిలో ఉన్న పుస్తకాన్ని పక్కన పెడుతూ అడిగాను.

"ప్లీజ్ ఒకసారి మాతో రండి సార్" మౌనిక కూడా అడిగింది. ఇద్దరూ అంతలా అడిగేసరికి వాళ్ళుండే క్యాంప్ దగ్గరికి వెళ్లాను. నాకు చాలా మొహమాటంగా,

సిగ్గుగా అనిపిస్తే వాళ్ళు మాత్రం నన్ను ప్రేమగా ఆహ్వానించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి కూర్చున్నట్టు మధ్యలో చిన్న టేబుల్ పెట్టుకుని కూర్చుంటే వాళ్ళతో నేను కూర్చున్నాను. పక్కన మండుతున్న ఆ వేడి సెగ పై నుండి కురుస్తున్న మంచుని, అక్కడ చలిని తరిమి కొడుతుంటే వెచ్చగా అనిపించింది.

"తీసుకోండి సార్!" అంటూ మౌనిక ఒక ప్లాస్టిక్ ప్లేట్‌లో సాండ్‌విచ్ పెట్టి ఇచ్చింది.

"అయ్యో వద్దమ్మా. నేను ఆల్రెడీ తినేశాను."

"పర్లేదు మళ్లీ తినండి సార్. ఏం కాదు" అని అరవంద్ అన్నాడు. వాళ్ళ ఫ్రెండ్స్ కూడా తినండి అనేసరికి కాదనలేక తీసుకున్నాను. వాళ్ళు కూడా తినడం మొదలుపెట్టారు.

"ఎక్కడికి వెళ్తున్నారు మీరందరూ?"

"కాశీ! మీరు?" మౌనిక పక్కన కూర్చున్న వ్యక్తి అన్నాడు.

"నేను కాశీ నుండి వస్తున్నాను. యాక్చువల్లీ ప్రతీ ఇయర్ ఏప్రిల్ ఏడుకి అక్కడుండేలా వెళ్తాను. బట్ ఈ ఈయర్ ఏప్రిల్‌లో వెళ్ళడానికి వీలు పడలేదు."

"మేము కూడా ప్రతి ఇయర్ ఏదోక ట్రిప్ వేస్తాము సార్. లాస్ట్ ఇయర్ కేరళ వెళ్లాము. ఈ ఇయర్ డివోషనల్ సైడ్ వెళ్ళాలని ఇక్కడికి వచ్చాము" అన్నాడు అరవింద్.

నేను ఆ సాండ్‌విచ్ తింటూ, "మీ అందరూ ఆఫీస్ కొలీగ్స్ ఆ?"

"లేదు సార్. స్కూల్ ఫ్రెండ్స్."

"వాట్!?", అనే మాట పూర్తి చేసేలోపు పొలమారి గొంతు మండిపోయింది. అది చూసి వాళ్ళందరూ తినడం ఆపి నా వైపు కంగారుగా చూసారు. అరవింద్ వాటర్ ఇస్తే, తాగి మండుతున్న గొంతుని సరి చేసుకున్నాను.

"ఏమైంది సార్?"

"కొన్ని కొన్ని సార్లు నిజం కళ్ళ ముందు కనిపించినా, అబద్ధంలా అనిపించి నమ్మడానికి టైం పడుతుంది. ఏం చేస్తారు మీరందరూ?"

"నేనూ, మౌనిక విప్రోలో చేస్తున్నాము. మీ పక్కన కూర్చున్న శేఖర్‌కి ఓన్ బిజినెస్ ఉంది. ఇంక జాహ్నవి ప్రైవేట్ బ్యాంక్ ఎంప్లాయి. అర్జున్ అయితే టూ ఇయర్స్ బ్యాక్ వరకు ఐ.కె.ఎస్‌లో చేసేవాడు. కానీ సినిమా మీద పిచ్చితో, జాబ్ రిజైన్ చేసి రైటర్‌గా చేస్తున్నాడు", అంటూ అరవింద్ వాళ్ల ఫ్రెండ్స్ గురించి చెబుతుంటే, చాలా ముచ్చటగా అనిపించి, నాకు తెలీకుండా చప్పట్లు కొడుతూ, "మీ ప్రయాణాలు వేరైనా, మీ స్నేహాన్ని మాత్రం ఎక్కడా వదిలిపెట్టకుండా ఒక సారథిలా మోశారు. అది నాకు బాగా నచ్చింది. ఎప్పటికీ అని చెప్పను గానీ, సాధ్యమైనంత వరకు ఇలానే ఉండండి."

కొన్ని సందర్భాల్లో వయసు తాలూకు తారతమ్యాన్ని అవతల వ్యక్తి ప్రవర్తన, మాటలు, చేసే పనులతో ఆ వ్యత్యాసాన్ని చెరిపేసి వాళ్ళతో గడపాలి అనిపిస్తుంది. ఆ క్షణం నేను కూడా అదే చేసాను.

చాలాసేపు వాళ్ళతో సరదాగా కబుర్లు చెప్పి ఇంక వెళ్లి పడుకోవడానికి సిద్ధమవుతుండగా, "హే! సరదాగా ట్రూత్ ఆర్ డేర్ ఆడదామా?" అని అర్జున్ అన్నాడు. ఆ మాటకు వాళ్ళందరూ ఆడదాం ఆడదాం అన్నారు. నేను మాత్రం మౌనంగా ఉండిపోయాను.

"సార్ మీరు కూడా ఆడతారా" మా  మధ్యలో ఉన్న టేబుల్ మీద వాటర్ బాటిల్ పెడుతూ అడిగాడు. అప్పుడు నాకేం చెప్పాలో అర్ధం కాక మొహమాటపడ్డాను.

"పర్లేదు సార్, మీకు ఇబ్బందిగా అనిపిస్తే వెళ్లి పడుకోండి. నో ప్రాబ్లెమ్" అరవింద్ అన్నాడు. ఆ మాటలు నా మనసులో, ఆడాలా? వద్దా? అనే సందిగ్ధమనే లోయలోకి గెంటేశాయి. వెంటనే అతికష్టం మీద బయటకొచ్చి, "నేను కూడా ఆడతాను" అన్నాను.

వెంటనే అర్జున్ చాలా ఎక్సైట్ అయ్యి గట్టిగా అరుస్తూ, "జాగ్రత్తగా వినండి. ఈ బాటిల్‌ని గట్టిగా తిప్పుతాను" అనే మాట సగంలో ఉండగా శేఖర్ మధ్యలో కల్పించుకుని, "వద్దు మావ స్లోగా తిప్పు. అంత ఆవేశంగా తిప్పితే అది టేబుల్ మీద కాకుండా నేల మీద తిరుగుతుంది." అని హాస్యమాడాడు.

అర్జున్ కొంచెం ఆవేశం తగ్గించికుని, "ఉష్! సరే నెమ్మదిగా తిప్పుతాను. అది తిరిగి తిరిగి ఎవరి వైపు ఆగుతుందో వాళ్ళు నిజమైనా చెప్పాలి. డేర్ అయినా చెయ్యాలి."

“అబ్బా!, వీడు ఆరంజ్ సినిమాలో రామ్ చరణ్ మరీ” మౌనిక వెటకారంగా అంది.

“అలానే అనుకో! తిప్పేస్తున్నా. అందరూ రెడీ నా?” ఆ మాటకు వాళ్ళందరూ రెడీ అన్నారు.

“సార్ మీరు?”

అప్పుడు నా బొటనవేలిని చూపిస్తూ రెడీ అన్నాను. ఆ మాట విన్న మరుక్షణం అర్జున్ వెంటనే బాటిల్ తిప్పడం మొదలుపెట్టాడు. అది తిరుగుతూ తిరుగుతూ చివరికి అర్జున్ వైపే ఆగింది. అది చూసి తను ఆశ్చర్యంతో అమాయకంగా చూస్తూ, “ఇదేంటి స్టార్టింగ్ ఏ నా వైపే వచ్చి ఆగింది” అని ఆశ్చర్యపోయాడు.

అది వినగానే వాళ్ళందరూ నవ్వుకున్నారు. నిజానికి నాకు కూడా నవ్వొచ్చింది. గట్టిగా నవ్వితే బాగోదని అదుపు చేసుకున్నాను.

“చెప్పు ట్రూత్ ఆ? డేర్ ఆ?” శేఖర్ అడిగాడు.

“నిజమే చెప్తాను. కొంచెం చూసి అడుగు” అన్నాడు భయం భయంగా.

అది చూసి అరవింద్ నవ్వుతూ, “రేయ్ అర్జున్! ఈరోజు నీకు కుక్క సావే. నువ్వు అడగరా శేఖర్” అని ఏడిపించాడు.

“నువ్వు డిగ్రీలో స్వప్నని లవ్ చేసావు కదా. మీ ఇద్దరికీ బ్రేకప్ కూడా అయ్యింది. ఆ తరువాత తనతో ఎప్పుడైనా మాట్లాడావా లేదా?”

ఆ ప్రశ్నకి అర్జున్ ముఖంలో భయం ఎక్కువైంది.

“రేయ్ శేఖర్ ఈ క్వశ్చన్ ఇప్పుడే అడగాలా?”

“ట్రూత్ అన్నావుగా చెప్పరా” నవ్వుతూ అన్నాడు.

“ఛీ! అనవసరంగా ఈ గేమ్ ఆడదాం అన్నాను.”

“ఎవడు తీసుకున్న గొయ్యిలో వాడే పడతాడు. చెప్పు.”

“మాట్లాడాను”, అంటూ అక్కడ నుండి నెమ్మదిగా లేచాడు. అది చూసి తన పక్కన కూర్చున్న జాహ్నవి కొంచెం కోపం వచ్చినట్టు, “రేయ్ వెధవ. నాతో ఏం చెప్పావురా! అక్క ఇంకెప్పుడు తనతో మాట్లాడను, దాని ముఖం కూడా చూడను

అన్నావు కదా!”

“అది కాదే అక్క. ఒక్కసారి నా మాట విను” అంటూ అక్కడ నుండి నెమ్మదిగా పారిపోవడానికి ప్రయత్నించాడు. అది చూసి జాహ్నవి పైకి లేస్తూ, “నువ్వు అక్కడే నిలబడు” అనేలోపు అర్జున్ అక్కడ నుండి పారిపోయాడు.

జాహ్నవి అర్జున్ వెనుక వెళ్తూ, “రేయ్ అర్జున్ ఆగరా! నీ పని చెప్తాను. చెత్త వెధవ ఆగు” అంటూ పరిగెత్తింది. అది చూసి అరవింద్, మౌనిక, శేఖర్ నవ్వుకున్నారు. నాకు ఎందుకో వాళ్లందరినీ చూస్తే ఒక తెలియని అనుభూతి కలిగింది.

“ఏంటి! అర్జున్,జాహ్నవి అక్కాతమ్ముళ్ళా?” అని ఆశ్చర్యంతో అడిగాను.

“కాదు సార్! కాకపోతే వాళ్లిద్దరూ స్కూల్ నుండి సొంత అక్కతమ్ముళ్ళా ఉన్నారు” అని శేఖర్ సమాధానం ఇచ్చాడు.

“జాహ్నవికి వాడు అంటే చిన్నప్పటి నుండి చాలా ఇష్టం సార్. సొంత తమ్ముడిలా చూసుకుంటుంది. ఈరోజు జాహ్నవి ఇలా ఉంది అంటే వాడే కారణం” మౌనిక అంది.

“ఏం అయ్యింది?” ఆశ్చర్యంగా అడిగాను.

“జాహ్నవి టాపర్ స్టూడెంట్ సార్. తనకి ఇండివిడ్యుయల్‌గా ఎదగాలని డ్రీమ్. కాకపోతే ఎం.బీ.ఏ అయ్యాక ఇంట్లో వాళ్ళు బలవంతంగా తనకి పెళ్లి చేశారు. పెళ్లి చేసిన సిక్స్ మంత్స్‌కి హస్బెండ్ ఆక్సిడెంట్‌లో చనిపోయారు. తన కూతురు జీవితం మేమే నాశనం చేశామనే బెంగతో వాళ్ళ నాన్న చనిపోయారు. ఒక్కసారిగా తన జీవితం తలక్రిందులైపోయింది. ఆ టైంలో మేమందరం హెల్ప్ చేశాము గానీ, వాళ్ల అక్కకి మాత్రం వాడే తోడుగా నిలబడ్డాడు. అందుకే వాళ్ల బాండింగ్ చూస్తే ఎవరైనా ఒకే తల్లికి పుట్టారేమో అనిపిస్తుంది.”

‘నిజమే సరస్వతికి దేవికి పుట్టారు’ అని మనసులో అనుకున్నాను.

అర్జున మళ్లీ బాటిల్ తిప్పడం మొదలుపెట్టాడు. ఈసారి అది మౌనిక వైపు వచ్చి ఆగింది.

“చెప్పు మౌనిక ట్రూత్ ఆ? డేర్ ఆ?” అర్జున్ అన్నాడు.

“డేర్.”

"హ్మ్! అరవింద్‌కి ఇప్పుడేదైనా గిఫ్ట్ ఇవ్వు."

"రేయ్ అర్జున్, ఇది టూ మచ్ రా. ఇప్పటికిప్పుడు ఇన్స్టెంట్‌గా ఎలా తెచ్చి ఇస్తుంది" శేఖర్ అన్నాడు.

"తెస్తుంది రా. మౌనిక వీర ప్రేమికురాలు."

అప్పుడు మౌనిక ఆలోచనల్లో పడింది. ఏం చేస్తుందా అని అందరం ఆశ్చర్యంగా చూసాము. వెంటనే నా టెంట్ దగ్గరికి వెళ్లి అక్కడ నేను చదువుతున్న పుస్తకం తీసుకొచ్చి,

"సార్ మీరు ఏం అనుకోకపోతే ఈ కాలాతీత వ్యక్తులు అనే నవల అరవింద్‌కి గిఫ్ట్‌గా ఇవ్వచ్చా! ప్లీజ్ తనకి బుక్స్ అంటే చాలా ఇష్టం" అని నన్ను రిక్వెస్ట్ చేసింది.

"మౌనిక, వద్దు! సర్ చదువుతున్న పుస్తకం మధ్యలో మనకెలా ఇస్తారు చెప్పు" అరవింద్ ఆమెని వారించాడు.

"పర్లేదు అరవింద్. ఇవ్వనివ్వు. నేను ఆల్రెడీ ఈ నవల చదివేశాను" అని పుస్తకం తనకే ఇవ్వబోయాను.

"మరి మళ్లీ ఎందుకు చదువుతున్నారు?" అర్జున్ అమాయకంగా అడిగాడు.

"నాకేదైనా పుస్తకం నచ్చితే, దాన్ని రెండు మూడు సార్లు చదివితేగాని సంతృప్తి ఉండదు. నువ్వు తీస్కో పర్లేదు."

అప్పుడు మౌనిక అభిమానంగా నావైపు చూస్తూ, థాంక్స్ చెప్పి ఆ బుక్ అరవింద్‌కి ఇచ్చింది. అది చూసి శేఖర్ విజిల్ వేశాడు.

"హే అర్జున్ ఈ డేర్ సరిపోతుందా" కాలర్ ఎగరేస్తూ గర్వంగా అంది. ఆ మాటకు అర్జున్ కొంచెం వెటకారంగా "సరిపోతుందిలే" అంటూ, బాటిల్‌ని మళ్లీ తిప్పాడు.

అందరూ దాని వైపు చాలా ఆతృతగా చూస్తున్నారు. ఎవరు వైపు వచ్చి ఆగుతుందా అని. అది తిరిగి తిరిగి నెమ్మదిగా నా వైపు వచ్చి ఆగింది.

అప్పుడు అర్జున్ "సార్ ఇప్పుడు మీరే" అన్నాడు. నేను కాస్త ఆలోచించుకుని, "ట్రూత్" అన్నాను.

"ఇప్పటివరకు మీరెంత మందిని లవ్ చేశారు?"

అది విని వాళ్ల ఫ్రెండ్స్ అందరూ ఆశ్చర్యపోయారు.

"రేయ్ అర్జున్ అదేం క్వశ్చన్ రా! అలా ఎవరైనా అడుగుతారా?" శేఖర్ తిట్టాడు.

"తప్పేముందిరా!? ఈరోజుల్లో ప్రేమనేది ఒకరితో ఆగటం లేదుగా. ఒకరు కాదంటే మరొకరి మీద షిఫ్ట్ అవుతున్నారు. అందుకే అలా అడిగాను."

"అయ్యిండొచ్చు. అంత మాత్రాన అలా అడిగేస్తావా? ఆయన ఫీల్ అవుతారని కొంచెం కూడా సెన్స్ లేదా" జాహ్నవి తిట్టింది.

ఆ మాటకు నేను అడ్డుపడి, "నేనేం ఫీల్ అవ్వలేదు. తన ప్రశ్నలో నిజం ఉంది. ఈ రోజుల్లో ప్రేమ ఒకరితో ఆగటం లేదు. నా ప్రేమ కూడా ఒకరితో ఆగలేదు"

"అంటే మీ ప్రేమను కూడా ఎవరైనా కాదన్నారా?" అర్జున్ ఆశ్చర్యంగా అడిగాడు.

నా షర్ట్‌కి తగిలించిన గ్లాస్సెస్ పెట్టుకున్నాను.

"అదేంటి సార్ ఈ టైంలో కూలింగ్ గ్లాస్సెస్ పెట్టుకున్నారు" అని శేఖర్ అడిగాడు.

"నా గతాన్ని మీ అందరికీ చెప్తాను. నా బాధను మాత్రం చూపించను."

వాళ్ళందరూ ఆశ్చర్యంతో, ఆతృతగా నావైపు చూసారు.

అర్జున్ మాత్రం పెట్టుకున్న మంకీ క్యాప్ తీస్తూ, "త్వరగా చెప్పండి సార్. ఎక్సైట్మెంట్ ఆపుకోలేకపోతున్నాను."

***

ప్రేమ!

ప్రేమనే రెండు అక్షరాల పదం, మనిషి అనే మూడు అక్షరాల వ్యక్తిని మాయ చేస్తుంది. ఈ ప్రేమ గురించి మాట్లాడటానికి మనిషి సరిపోడు. పలకడానికి పదాలు సరిపోవు. వినడానికి ఓపిక సరిపోదు. చెప్పడానికి సమయం సరిపోదు. అందుకే ప్రేమ అంత అద్భుతమైనది. నిజం చెప్పాలంటే, ప్రేమనేది ప్రత్యక్షంగా ఎవరికి కనిపించదు. అలాగని పరోక్షంగా ఎక్కడా జీవించదు. అది కేవలం మనస్సులో ఉండే

ఒక ఖైదీ. అందుకే మనస్సులో పుట్టే ప్రేమను హత్య చేయకూడదు. మనస్సులో లేని ద్వేషనికి ప్రాణం పోయకూడదు. నిజానికి లవ్‌లో టూ ఫీలింగ్స్ ఉంటాయంటారు. వన్‌సైడ్ లవ్, టూసైడ్ లవ్. వీటిలో నేను ఫీల్ అయిన లవ్ గురించి మీకు చెప్తాను. మీ అందరికీ చాలా ఆత్రుతగా ఉంది కదూ! ఎందుకంటే, ఈ ప్రపంచంలో ఎదుటి వ్యక్తి ఏ విషయం చెప్పినా, దాని పట్ల మనం పెద్దగా ఇంట్రెస్ట్ చూపించము. కానీ ప్రేమనే టాపిక్ మాట్లాడేసరికి, మనకు ఎంత పని ఉన్నా, దాన్ని వదులుకుని మరీ వింటాము. అందుకే మనం పుట్టినప్పటి నుండి మరణించే వరకు ప్రేమనే భావోద్వేగానికి లోబడి ఉంటాము. అంతే కాదు, ఈ ప్రపంచంలో ఏ వ్యక్తి అయినా బాధలు లేకుండా ఒకరికి బానిసగా ఉన్నాడు, అంటే అది ప్రేమకు మాత్రమే. అందుకే ప్రేమ కనిపించని వస్తువైనప్పటికీ అందరి మనస్సుల్లో నిలిచిపోయే ఒక ఎమోషన్.

***

అప్పుడు నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. నాకంటూ ఒక ప్రపంచం ఉంది. స్కూల్, ఫ్యామిలీ, ఫ్రెండ్స్ ఇవే నా ప్రపంచం. కానీ ప్రేమనే ప్రపంచం ఉంటుందనీ, అది నాకు పరిచయం అవుతుందనీ, అసలు అనుకోలేదు. 'ప్రేమ' అనే పదం తెలుసు గాని, దాని అర్థం తెలీదు. రోజూ స్కూల్‌కి వెళ్ళటం, చదువుకోవటం, ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేయటం. ఆ విధంగా నా లైఫ్ ముందుకు వెళ్లిపోయేది.

అప్పటి వరకు తనతో ముఖ పరిచయం, మాట పరిచయం ఉంది కానీ, తరచూ మాట్లాడుకునేంత ఫ్రెండ్‌షిప్ అయితే లేదు. ఇంతకీ తను నా క్లాస్ కాదు. మా పక్క క్లాస్.

మీరు కంగారు పడకండి. మా క్లాస్ స్టూడెంట్స్ చాలా తక్కువ. అందుకే ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం స్టూడెంట్స్ కలిసిమెలిసి ఉండేవాళ్ళం. ఉన్నట్టుండి, ఆ అమ్మాయి నాతో మాట్లాడటం స్టార్ట్ చేసింది. కనిపిస్తే హాయ్ చెప్పేది, ఇంటికి వెళ్ళేటప్పుడు బై చెప్పేది. ఆ విధంగా మా మధ్య మాటలు నడిచేవి. ఇంతకి మీకు తన పేరు చెప్పలేదు కదూ. తన పేరు ‘సుకన్య’.

పేరు విన్నారు కదా. ఎంత అందంగా ఉందో. తను ఇంకా అందంగా ఉంటుంది. సరే సరే వినండి. రోజూ తనతో మాట్లాడటం, కలిసి భోజనం చేయటం. అప్పుడప్పుడు ఇద్దరం సరదాగా గొడవపడి కొట్టుకునేవాళ్ళం.

ఇలా మాటలూ, మధ్యమధ్యలో చిన్న చిన్న గోడవలతో మా ఫ్రెండ్‌షిప్ నడిచేది. ఉన్నట్టుండి తనతో ఉన్న ఫ్రెండ్‌షిప్ ప్రేమగా మారింది. చాలా కొత్తగా మాటలతో చెప్పలేనంత అద్భుతంగా ఉంది. ఎందుకో తెలీదు, నా మీద నాకే ఆశ్చర్యమేసింది. ఏదో తెలియని మైకం నన్ను ప్రేమతో కమ్మేసింది.

మీ అందరికీ అనుమానం రావొచ్చు. నైంత్ క్లాస్‌కి లవ్ ఏంటని!. నిజమే, కానీ ప్రేమకు ఆ విషయం తెలీదు. ఎందుకంటే, ఎగిరే పక్షికి ఎంత స్వేచ్ఛ ఉందో, మనస్సులో పుట్టే ప్రేమకు కూడా అంతే స్వేచ్ఛ ఉంది. అందుకే ప్రేమ ఎప్పుడు, ఎక్కడ, ఎవరి మీద ఎలా పుడుతుందో ఎవ్వరికీ తెలీదు.

అప్పటి వరకు సుకన్య ఎదురుపడితే ఫ్రెండ్ కదా అనుకునేవాడిని. కానీ ఎప్పుడైతే తన మీద ప్రేమ పుట్టిందో, ఒక ఏంజెల్ ఎదురయ్యిందని ఫీల్ అయ్యేవాడిని. నాకు ఉన్నా ఏకైక అదృష్టం ఏమిటంటే, సుకన్య ఇల్లు మా పక్క వీధిలోనే.

కొన్ని జ్ఞాపకాలు అనుకోకుండా మన లైఫ్‌లోకి వచ్చి, అనుకుంటూ లైఫ్ లాంగ్ మనతోనే సెటిల్ అయిపోతాయి.

***

ఆరోజు సాటర్‌డే. శనివారం అంటే అందరికి గుర్తుండేది, ప్రతి ఒక్కరు వాళ్లకు నచ్చిన డ్రెస్ వేసుకుని, స్కూల్‌కి రావడం. నేను కూడా నాకు నచ్చిన డ్రెస్ వేసుకుని స్కూల్‌కి వెళ్ళాను.

అదేంటో ఆ రోజు సుకన్య నాకు ఇష్టమైన బ్లూ కలర్ డ్రెస్ వేసుకుంది. మధ్యాహ్నం భోజనం చేసి, తన క్లాస్‌కి వెళ్తుండగా, సుకన్య క్లాస్ బయట కూర్చొని ఉంది. నేను దగ్గరికి వెళ్లి ‘భోజనం చేసావా?’ అని అడిగి, తన తల మీద కొట్టగానే తను కొంచెం కోపంగా, మరికొంచెం అమాయకంగా, ఇంకొంచెం ఇష్టంగా నావైపు చూసింది. తరువాత నేను విండో దగ్గరకి వెళ్లి బయట వ్యూ చూస్తుండగా సుకన్య వెనుక నుండి వచ్చి నన్ను కొట్టి అక్కడ నుండి పారిపోయింది.

తనను కొట్టడానికి గోడ చాటుకు వెళ్లి దాక్కుని, బయటకు వస్తుండగా, తను కూడా నన్ను కొట్టడానికి అదే గోడ వెనుకాల నుండి బయటకు వచ్చింది. అంతే ఇంకేముంది. తన ఫేస్‌కి నా ఫేస్‌కి వన్ సెంటిమీటర్ గాప్. తన కళ్లకు నా కళ్ళకు టూ సెంటిమీటర్ గ్యాప్. తన పెదవులకు నా పెదవులకు టూ సెంటిమీటర్ గ్యాప్.